# మరో మలుపు

అప్పుడే భోజనం ముగించి యాదాలాపంగా ఏదో మేగజైన్ తిరగేస్తున్న సుజాత దృష్టిని ఒక వార్త ఆకర్షించింది. ఆ వార్త సారాంశం ఏమిటంటే తమిళనాడుకు చెందిన ప్రేమలత అనే చిన్నది గుణశేఖరన్ అనే చిన్నవాడిని ప్రేమించి వివాహం చేసుకున్నది. గుణశేఖరన్ హిందువు. బాంకు ఉద్యోగి. ప్రేమలత క్రిస్టియన్. అంతవరకూ ఆశ్చర్యం ఏమీలేదు కాని, ఆ తరవాత జరిగిన సంఘటనే విడ్డూరమైనది. పెళ్ళిలో గుణశేఖరన్ ప్రేమలత మెడలో మంగళసూత్రం కట్టాడు. ఆ తరవాత ఆనందంతో కలకలలాడవలసిన ఆ చిన్నదాని వదనం చిన్నబోయి ఉంది. కారణం తెలియక గుణశేఖరన్ కలవరపడ్డాడు.

వధువుని బుజ్జగించి రాబట్టిన కారణం ఏమిటంటే ప్రేమలత తనకు భర్త మంగళసూత్రధారణం చేసినట్టే తనుకూడా భర్తకు మంగళసూత్రం కట్టాలని ముచ్చటపడింది. భార్యాభర్తలు అన్నింటిలోనూ సరిసమానమని ఊరికే గొంతు చించుకుని అరవగానే సరిపోతుందా? ఏదీ, ఎక్కడుందా సమానత్వం? పెళ్ళిలో ఆడపిల్ల కొక్కదానికే ఎందుకు మంగళసూత్రం? మగవాడి కెందుకు ఉండకూడదు? ఆడదానికి పెళ్ళైన గుర్తుగా మంగళసూత్రం ఉన్నట్టే మగవాడికికూడా ఏదో ఒక గుర్తు ఉండాలి కదా! తన ఇల్లాలి వాదన సమంజసంగానే ఉన్నట్టు తోచింది గుణశేఖరన్‌కి.

ది. అందుకే వెంటనే తలవంచుకుని బుద్ధిగా ప్రేమలత చేత మెడలో వేయించుకున్నాడు-సన్నని చెయినులో మంగళసూత్రం వంటి లాకెట్టు. అందులో ముచ్చటగా అమర్చిన ప్రేమలత ఫోటో ఉంది.

ఈ వార్త చదివిన సుజాత గుండె ఆనందంతో గంతు లేసింది. మరో వారం రోజుల్లో జరగబోయే తన వివాహముహూర్తం మనసులో మెదిలింది. కాబోయే భర్త భాస్కర్ తలపుల్లో మెదిలి సిగ్గుల మొగ్గ అయింది సుజాత. ప్రేమలత సాహసం మనసులో మెదిలి తను మాత్రం అలాంటి సాహసం ఎందుకు చెయ్యకూడదని ఉత్సాహపడింది. అనాదిగా జరుగుతూ వస్తూన్న వివాహసాంప్రదాయాన్ని తన వివాహం ఒక కొత్త మలుపు తిప్పాలి. ఎక్కడో అరవదేశంలో ఆడపిల్ల చేసిన సాహసం తెలుగు దేశపు తరుణి తను మాత్రం చెయ్యలేదా! తన పెళ్ళి పాతచింతకాయ పచ్చడిలా కాకుండా, పదిమందీ పది కాలాలపాటు చెప్పుకునేదిగా ఉండాలి. కాలేజీ రోజుల్లో స్త్రీపురుష సమాన హక్కులు, వరకట్న దురాచారం మొదలైన వాటిపై ఎన్నో చర్చల్లో పాల్గొని మంచి వక్తగా, అభ్యుదయ వాదిగా పేరు తెచ్చుకున్న సుజాత తన పెళ్ళిలో ప్రేమలతలాగా తనుకూడా చరిత్రని మరో మలుపు తిప్పాలని ఉబలాటపడింది. తెలుగుదేశపు తరుణులు అరవదేశపు అతివలకేమీ తీసిపోరని రుజువు చెయ్యాలనుకుంది.

ఎంతగానో ఎదురుచూసి, కలలు గన్న పెళ్ళి రోజు రానే వచ్చింది. మంగళవాద్యాల మధ్య మంగళసూత్రధారణ దివ్యంగా ముగిసింది. పురోహితుడు తరువాయి కార్యక్రమం ప్రారంభించే హడావిడిలో ఉన్నాడు. ఇదే...సరియైన సమయం. ప్రేమలత మనసులో మెదిలిన సుజాత ధైర్యం కూడగట్టుకొని "ఆగండి" అని అరిచింది గట్టిగా. కమ్మని వీణానాదంలో అపశ్రుతిలా ధ్వనించిన ఆ కేకకు భాస్కర్ ఆశ్చర్యంగా సుజాత ముఖం వంక చూశాడు. కలకలలాడవలసిన సుజాత వదనం చిన్నబోయి అప్రసన్నంగా ఉండడం చూసి ఆరాటంగా- "ఏమైంది సుజా!" అని ఆరాటంగా అడిగాడు. సుజాత గొంతు సవరించుకొని మొదలెట్టింది. "భాస్కర్! నిన్ను ఒకటి అడగాలనుకుంటున్నాను. ఈ శుభ సమయంలో అందరి సమక్షంలో నా మెడలో మూడు ముళ్ళూ వేశావు. సంతోషం. కాని, మరి నీకు పెళ్ళయిన గుర్తు ఏదీ? కేవలం ఆడదే మంగళసూత్రం ధరించాలా? మగవాడెందుకు ధరించకూడదు? అందుకే ఇప్పుడు నేనూ నీ మెడలో వేస్తాను" అంటూ అంతకు మునుపే సిద్ధం చేసుకుని ఉంచుకున్న లాకెట్ అమర్చిన సన్నని చెయిన్ తీసింది.

అనుకోని ఈ హఠాత్పరిణామానికి పెళ్ళికి వచ్చిన వారంతా తెల్లబోయారు. బంధువులు, స్నేహితులు, పురోహితులు ముందు నోట మాటరాక, తేరుకుని, భాస్కర్ వంక హేళనగా, ఒకింత కుతూహలంగా చూడసాగారు- భాస్కర్ రియాక్షన్ ఎలా ఉంటుందోనని.

అందరిలోకీ సుజాత అత్తగారు ముందుగా తేరుకుని, బుగ్గలు నొక్కుకుంటూ "అయ్యో! అయ్యో! ఇదెక్కడి విడ్డూరమమ్మా! మగవాడికి తాళి కడతానంటుందా! ఎంత పొగరు? కలికాలం కాకపోతే. ఒరేయ్ భాస్కర్! పదరా ఇంకా ఎందుకు స్తంభంలా నుంచుంటావు...జరిగిన అవమానం చాలుగానీ ఇక నడు" అంటూ ఆయాసంతో రొప్పసాగింది- అప్పటికే బి.పి. పెరిగిపోయిన ఆవిడ.

"అమ్మా! సుజా! ఏమిటమ్మా ఇది? నీకేమైనా మతిగానీ పోయిందా! భాస్కర్ కాస్త ఆగు నాయనా! వదినగారూ! కాస్త నెమ్మదించండి. చిన్న పిల్ల. తెలిసీ తెలియక చేసిన పొరబాటు. క్షమించండి. దానికి నేను నర్ది చెప్తాను. మిగతా కార్యక్రమం జరగనివ్వండి." నిండు పందిట్లో జరిగిన ఈ అస్తవ్యస్తాన్ని ఎలా సరిదిద్దాలో తెలియక గద్గద స్వరంతో బతిమాలసాగాడు సుజాత తండ్రి.

"ఫరవాలేదు. కట్టించుకో గురూ! పాపం మీ ఆవిడ అంత సరదా పడుతూంటే. పసుపుతాడైతే కాదు గదా." వ్యంగ్యంగా అంటున్న స్నేహితుడి మాటలతో, బంధుమిత్రుల హేళన, సానుభూతి నిండిన చూపులతో భాస్కర్‌లోని పురుషాంకారం తన్నుకొచ్చింది. "ఇడియట్! నాకు తాళి కడతానంటావా! ఎంత అహంకారం..." పళ్ళు పటపటలాడిస్తూ విసురుగా సుజాత చెంప ఛెళ్ళుమనిపించాడు.

అనుకోని ఈ సంఘటనకి సుజాత తెల్లబోయింది. కందిపోయిన చెంపని చేత్తో అదుముకుంటూ, గుడ్లనీరు కుక్కుకుంటూ నిల్చుండిపోయింది సుజాత.

-కె.రమ

